వైద్యులు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిపై సమీక్ష


అభివృద్ధిపై చర్చిస్తున్న కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ప్రభుత్వ అధికారులు తమ పనితీరు మార్చుకొని బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం దుబ్బాక ఐఓసీ భవన్‌లో నియోజకవర్గం అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యశాఖల అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలతీరుపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో చేపట్టిన 172 పాఠశాలలో పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ప్రైవేట్ భవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తరలించేందుకు ప్రభుత్వ భవనాలను గుర్తించాలన్నారు.

24 గంటలు వైద్యం అందించాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు వైద్యం అందించాలన్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దుబ్బాక సీహెచ్‌సీలో డాక్టర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను కవర్ చేస్తు ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. ఇతర ప్రాంతాలకు ఉన్న బస్సులను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత విభేదాలు

- ఆలయ ఈఓ ఎదుటే ఉద్యోగుల బాహాబాహీ
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- సంఘటనలపై దేవాదాయ శాఖ కమిషనర్ ఆరా
- ఉద్యోగుల్లో గుబులు


కొమురవెల్లి ఆలయం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. నిత్యం ఏదో వివాదంతో వార్తల్లో నిలుస్తోంది. ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల మధ్య అంతర్గత విభేదాలు తలెత్తుతుండంతో వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఆదివారం ఆలయ ఉద్యోగుల మధ్య జరిగిన ఘర్షణే ఉదాహరణ. ఆలయంలో జరిగే అంతర్గత వ్యవహారాలపై గతంలో దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. దీనికి ముఖ్య కారణం ఆలయ ఉద్యోగులు బదిలీలు లేకుండా కొన్నేళ్లుగా పనిచేస్తుండటంతో అంతర్గత విభేదాలు తలెత్తి ఒకరిపైఒకరు చేయి చేసుకొనే వరకు దారి తీసింది. అంతర్గత విషయాలను బయటకు చెబుతున్నాడనే నెపంతో ఏఈవో గంగా శ్రీనివాస్, ప్లంబర్ విజయకుమార్‌లు ఏఈ అంజయ్య చెంపపై కొట్టడంతోపాటు ఈవో ఎదుటే దూషించారు. దీంతో ఏఈ దాడి చేసినవారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది

విభేదాలకు కారణం..

ఆలయంలో జరుగుతున్న వివాదాలకు ముఖ్య కారణం ఆలయంలో రెగ్యులర్ ఈవో లేకపోవడమే. దీంతో ద్వితీయ శ్రేణి ఉద్యోగులు ఆడింది ఆటగా పాడింది పాటగా అన్న చందంగా ఉంది. గత మూడేళ్లుగా హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న బాలాజీ కొమురవెల్లి ఇన్‌చార్జి ఈఓగా పనిచేస్తున్నారు. వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే ఆలయానికి వస్తుండటంతో ఉద్యోగులపై పర్యవేక్షణ కరువైంది. కొందరు ఉద్యోగులు విహారయాత్రకు వెళ్లినప్పుడు హాజరు రిజిస్టర్‌లో పెన్సిల్‌తో సీఎల్ రాసి మళ్లీ విధులకు హాజరైన తర్వాత సంతకాలు చేస్తున్నారని ఆలయ ఉద్యోగి ఈఓకు ఫిర్యాదు చేయడంతోనే అతడిపై సదరు ఉద్యోగులు చేయిచేసుకున్నట్లు సమాచారం. ఆలయంలో జరుగుతున్న సంఘటనలపై దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు ఆరాయడంతో ఉద్యోగుల్లో గుబులు మొదలైంది.

విభేదాలు లేవు



కొమురవెల్లి మల్లికార్జున ఆలయ ఉద్యోగుల మధ్య విభేదాలు లేవు. అలాంటివి ఉంటే వాటిని అంతర్గతంగా పరిష్కరించుకుంటాం. కొందరు ఉద్యోగులు కావాలనే ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారు. వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటాం.

– బాలాజీ, ఆలయ ఈఓ

క్లుప్తంగా

మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా యూసుఫ్


యూసుఫ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని ఒబులాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ యూసుఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మజారుద్దీన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. అనంతరం యూసుఫ్‌ను పార్టీ నాయకులు సన్మానించారు.

బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త నజీర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో రూ.2 లక్షల బీమా మంజూరైంది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బుధవారం బీమా చెక్కును నజీర్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, కోఆప్షన్ మెంబర్ అహ్మద్, ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ పాల్గొన్నారు.

చెత్తతో ఎరువు తయారు చేసుకోవాలి

హుస్నాబాద్ రూరల్: తడి చెత్త, పొడి చెత్తతో ఇంట్లోనే ఎరువును తయారు చేసుకొని మొక్కలకు వేసుకోవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. బుధవారం 4వ వార్డులో బేసిల్ ఫౌండేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో తడి పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కాలుష్యం పెరిగి పర్యావరణం దెబ్బతింటుందని, ప్లాస్టిక్ బదులు పేపరు బ్యాగ్స్‌ను వాడుకోవాలని చెప్పారు.

దుబ్బాక అభివృద్ధే లక్ష్యం

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. మున్సిపల్ పరిధిలోని ధుంపల పల్లి 4వ వార్డులో నీటి సమస్య రావడంతో నూతన బోరును ఏర్పాటు చేశారు. బుధవారం చైర్‌పర్సన్ వనిత కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఏ సమస్య వచ్చినా కౌన్సిలర్ల తన దృష్టికి లేదా చైర్‌పర్సన్ దృష్టికి తీసుకు రావాలన్నారు.

తోటపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్

బెజ్జంకి(సిద్దిపేట): కాస్ట్ లీడర్ షిప్ అండ్ పాలిటిక్స్ ఇన్ తెలంగాణ స్టేట్ పరిశోధక అంశంపై మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన మాషం శ్రీనివాస్‌కు వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ నరసింహాచారి మాట్లాడుతూ హరిప్రసాద్ పర్యవేక్షణలో శ్రీనివాస్ సమర్పించిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు.

లారీలు ఢీ: డ్రైవర్‌కు గాయాలు

సిద్దిపేటఅర్బన్: బీర్ల లోడ్ లారీని మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డికి చెందిన షేక్ తౌఫిక్ హైమద్‌కు చెందిన లారీలో డ్రైవర్ ఇస్మాయిల్ శివ్వంపేటలోని ఓ బీర్ల కంపెనీ నుంచి బీర్లు లోడ్ చేసుకొని కరీంనగర్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో ఎన్సాన్‌పల్లిలోని అంబేద్కర్ సర్కిల్ మూలమలుపులో ఎదురుగా వచ్చిన మరో లారీ ఢీకొట్టడంతో ఇస్మాయిల్‌కు గాయాలయ్యాయి.

కొనసాగిన పరీక్ష

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామక పరీక్ష మూడవ రోజు కొనసాగింది. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 77 మంది, 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 77 మంది హాజరయ్యారు. పట్టణంలోని వెరిటాస్ అండ్ వర్చ్యాస్ ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో నిర్వహించిన పరీక్షకు హాజరైన దివ్యాంగుడిని సిబ్బందితో కలిసి కానిస్టేబుల్ వేణు పరీక్ష కేంద్రం లోపలికి కుర్చీలో మోసుకువెళ్లారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్


స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్

సిద్దిపేటఅర్బన్: అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్ సూచించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలంతో పాటు పట్టణంలోని విత్తన, పురుగు మందుల దుకాణాలను ఏఓ పరశురాంరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, అందుబాటులో ఉన్న విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను పరిశీలించారు. స్టాక్ వివరాలను నోటీస్ బోర్డులో పేర్కొనాలని సూచించారు.

త్వరలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పది, ఇంటర్‌లో రాణించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామని, ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని శ్రీ వైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలక మర్రి వెంకటరమణాచార్యులు తెలిపారు. శ్రీ వైష్ణవ సంఘం 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న రజతోత్సవ వేడుకల కరపత్రాలను బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జూలై 20వ తేదీ నిర్వహించనున్న ఉత్సవాలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వైద్య కృష్ణమాచారి, కోశాధికారి శేషం గోపీకృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

మొలకెత్తని వరి విత్తనాలు

- ఆందోళనలో అన్నదాతలు
- నకిలీ విత్తనాలు ఇచ్చారని ఆరోపణ


మొలకెత్తని వరి విత్తనాలను చూపుతున్న రామవరం గ్రామ రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తమకు నకిలీ విత్తనాలను విక్రయించారని ఆరోపిస్తూ బుధవారం పలువురు రైతులు ఆందోళన దిగారు. అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన మెడబోయిన రాజు, గణేష్‌రెడ్డి, లింగారెడ్డి, బొమ్మ నవీన్ ములుకనూరు సీడ్స్ ఎంటీయూ–1010 రకం వరి విత్తనాల ప్యాకెట్లను ఒక్కొక్కటి రూ.800 చొప్పున గ్రామంలోని మల్లికార్జున ఫర్టిలైజర్ దుకాణంలో కొనుగోలు చేశారు. వరి విత్తనం నానబెట్టి దాదాపు ఎనిమిది రోజులైనా మొలకెత్తకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మూడు లేక నాలుగు రోజులలోపే మొలకెత్తుతాయని, తాము మోసపోయామని చెబుతున్నారు. వరి సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నామన్నారు. సదరు ఫర్టిలైజర్ దుకాణదారుడిని అడిగితే పొంతలేని సమాధానాలు చెబుతున్నాడన్నారు. జిల్లా ఉన్నతాధికారులు నకిలీ విత్తనాలను అమ్మిన దుకాణదారుడిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

వైభవంగా శతచండీ హోమం


హోమంలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధి మోతెలో భువనేశ్వరీ సమేత రామలింగేశ్వరాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రాజశ్యామల సహిత మహారుద్ర పురస్సర శత చండీ హోమం నిర్వహిస్తున్నారు. బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్‌ఎస్ నాయకులు సూకూరి లింగం, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ ప్రశాంతం


దౌల్తాబాద్ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఏబీవీపీ నాయకులు

దుబ్బాకటౌన్: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదంటూ అఖిల భారత విద్యార్థి పరిషత్ బుధవారం పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో మండల పరిధిలోని పాఠశాలలను ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లను అందజేస్తున్న సీఐ, ఎస్‌ఐ

నంగునూరు(సిద్దిపేట): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినం పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం సిద్దిపేట రూరల్ సీఐ, రాజగోపలపేట ఎస్‌ఐ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నంగునూరులో ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సిద్దిపేటరూరల్: కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శోభ, కమిటీ సభ్యుడు భాస్కర్ పాల్గొన్నారు.

ఎంబీఏ ఎంట్రెన్స్‌లో 91వ ర్యాంక్

సిద్దిపేటజోన్: పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ నిర్వహించిన ఎంబీఏ ప్రవేశపరీక్షలో సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాల విద్యార్థి చాణక్య జాతీయ స్థాయిలో 91వ ర్యాంక్ సాధించాడు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్య ప్రకాష్ రావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తమ విద్యార్థి ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. చాణక్యను అధ్యాపకులు అభినందించారు.

తడిచెత్తతో ఎరువు తయారు చేసుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: పట్టణంలోని 4వ వార్డులో స్వచ్ఛ సర్వేక్షన్ 2024 కార్యక్రమంలో భాగంగా బేసిల్ ఫౌండేషన్ ప్రతినిధులు తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ ఇంటి యాజమానులు చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. స్థలం ఉన్న వారు ఎరువును తయారు చేసుకోవచ్చని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు పేపర్ సంచులు వాడాలని కోరారు. ఇకపై చెత్త వేరుచేసి ఇవ్వకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలకు డిమాండ్


ధర్నా చేస్తున్న రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టాచేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. అక్కన్నపేట మండలంలోని సర్వే నంబర్ 436లో 1.14 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒకరికి పట్టా చేశారన్నారు. అక్రమ పట్టాపై పలుమార్లు తహసీల్దార్‌కు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పిల్లెట్ల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు.. మానవహారాలు

మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని, యువత మత్తు పదార్థాల వలలో పడి చిత్తు కావొద్దని పోలీసులు అధికారులు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీలు, మానవ హారాలు నిర్మించారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. వారితో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.


దుబ్బాకలో మత్తు పదార్థాల నిర్మూలన అవగాహన ర్యాలీ


హుస్నాబాద్‌లో విద్యార్థుల మానవహారం


గజ్వేల్‌లో ..


చేర్యాలలో..

సంక్షిప్త వార్తలు

◆ తారు రోడ్డు నిర్మించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని మల్లుపల్లి నుంచి అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధి పీరారెడ్డిపల్లి వరకు తారు రోడ్డును నిర్మించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మండల అధ్యక్షుడు ర్యాగట్ల చందు మహారాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ నారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ అక్బర్‌పేట–భూంపల్లి మండల అధ్యక్షుడు కనక మల్లేశం, మండల నాయకుడు రాకేష్ పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని చందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు అనిశెట్టి సతీశ్ కుమార్ పదోన్నతితో బదిలీపై వెళ్తున్నారు. బుధవారం విద్యార్థులకు నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సిద్దేశ్వర్ మాట్లాడుతూ తెలుగు ఉపాధ్యాయుడి కృషితో విద్యార్థులు అనేక అవార్డులు అందుకున్నారన్నారు. రెండేళ్లుగా సిద్దిపేటకు చెందిన బాల సాహితీ సంస్థ నిర్వహించిన కథల పోటీల్లో తమ విద్యార్థులు జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

◆ స్కూల్ ప్రవేశాలకు ఎంపికలు

మద్దూరు(హుస్నాబాద్): ఈనెల 28వ తేదీన మద్దూరు ఉన్నత పాఠశాలలో క్రీడా పాఠశాల ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 21వ తేదీ మధ్య పుట్టిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ వెంట తేవాలన్నారు. వివరాలకు మహ్మద్ ఇంతియాజ్ హుస్సేన్ (99891 32656), దామెర ప్రేమ్‌కుమార్(90009 97100)ను సంప్రదించాలన్నారు.

◆ వర్షాల కోసం పూజలు

గజ్వేల్‌రూరల్: వర్షాలు కురవాలని కోరుతూ మండల పరిధిలోని ధాతర్‌పల్లిలో బుధవారం హనుమాన్ దేవాలయంలోగల శివలింగానికి జలాభిషేకం చేశారు. శివలింగం మునిగేవరకు గ్రామస్తులు బిందెలతో నీళ్లు పోశారు. పూజ చేసిన 24 గంటల్లో వర్షం కురుస్తుందనే నమ్మకముందని గ్రామస్తులు తెలిపారు. అలాగే పట్టణంలోని రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో వర్షాలు సమృద్ధిగా కురియాలని పూజలు నిర్వహించారు.

◆ నూతన నియామకం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, న్యూ నాయీ బ్రాహ్మణ సేవా సంఘాల నూతన కమిటీని బుధవారం సిద్దిపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేముల కుమార్, ప్రధాన కార్యదర్శిగా స్వామి, కోశాధికారిగా కొత్వాల్ విజయ్‌ను ఎన్నికయ్యారు. జిల్లాలోని నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

◆ మహిళలకు ఉచిత శిక్షణ

సిద్దిపేటకమాన్: ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు స్వరూపరాణి తెలిపారు. శిక్షణను 30 రోజులలో పూర్తిచేసి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు తమ వివరాలు, రెండు ఫొటోలతో 98858 85262 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈనెల 28వ తేదీ నాటికి తమపేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

◆ పంచాయతీ ట్రాక్టరుతో వెంచర్‌కు నీటి సరఫరా

కొండపాక(గజ్వేల్): గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను ప్రైవేటు వెంచర్‌లో నీటి సరఫరా కోసం వినియోగిస్తున్నారు. ఈ సంఘటన కొండపాకలో బుధవారం చోటు చేసుకుంది. పంచాయతీ అవసరాల కోసం ప్రభుత్వం ఒక్కో పంచాయతీకి ట్రాక్టర్‌ను అందజేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు రుసుం చెల్లించినవారికి పంచాయతీ ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేస్తారు. కానీ, ప్రైవేటు వెంచర్లకు నీటిని సరఫరా చేయరు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొండపాక గ్రామ పంచాయతీ ట్యాంకరుతో రాజీవ్ రహదారికి సమీపంలో చేస్తున్న వెంచరులోకి నీటిని సరఫరా చేస్తున్నారు. సిబ్బందిని అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఎంపీఓ వీరరాజును వివరణ కోరగా గ్రామంలో జరిగే శుభకార్యాలకు రుసుం చెల్లించి ట్రాక్టరుతో నీటిని సరఫరా చేసుకునే అవకాశం ఉందని, ప్రైవేటు వెంచరులోకి సరఫరా చేసుకునే అవకాశం లేదన్నారు.

◆ పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు

మద్దూరు(హుస్నాబాద్): పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పచ్చి రొట్టసాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్టసాగు చేస్తే నాణ్యమైన పంటలు పండించవచ్చన్నారు.